# వన్స్ మోర్.

భమిడిపాటి కామేశ్వరరావు గారు

'వన్స్‌మోర్' అనే ముక్క, రెండు ఇంగ్లీషు మాటల యొక్క సంపుటే. అయినప్పటికీ ఇది ఆంధ్రదేశంలో ఇంగ్లీషు చదువుకోని వాళ్లల్లో కూడా చిరకాలంనించి చలామణీ అవుతోంది. నాటకరంగంతో ఎటువంటి ప్రమేయం ఉన్నవారైన సరే, ఇది విని ఊరుకోరు. దీని జననకాండ మొన్నటిదాకా అంధకారంలో పడిపోయి ఉంటేగాని, ఇటీవల ఒక చరిత్రకారుడు శ్రమించి పరిశోధించి దీన్ని కొంత వెలుగులోకి దొర్లించాడు. అతడు కనిపెట్టిన దాని ప్రకారం:

క్రీస్తుశకం 1888 ప్రాయల్ని చంద్రపురం బస్తీలో శృంగినాదం నవరసమూర్తి అనే వ్యక్తి ఉండేవాడు. అప్పట్లో అతను ఒక తాణేదారు. ఆయన ఒక్కడే ఆ ఊళ్లోకల్లా హోదా మనిషి. తన హోదా చిరస్థాయిగా నిలుపుగోడానికి, అతడు, వెంకిజరీ చీర తలపాగా, కుడిచేతికి సింహతలాటంచురుగూ, సీలమండలదాకా కోటూ, పైమీద ఏక కాలమందే రెండుమూడు రకాల కండువాలూ ధరిస్తూండడమే కాక, మాటలాడినప్పుడల్లా మరచిపోకుండా నూటికి నూరు బూతులు వాడుతూండడమే కాక రెండున్నరో భోగం మేళాలు స్వయంగా పోషించేవాడు. మరో ప్రత్యేకమునక. ఆ ఊళ్లో ఇంగ్లీషువచ్చినవాడూ అతనొకడే. అల్లాంటప్పుడు అతను ఏం మాట్లాడితే ఇంగ్లీషైపోయి ఊరుకోదు గనక! అందుకనే, ఊరివారు బంధుమిత్ర పరివార సమేతంగా ఆయన దగ్గిరికి పరిగెట్టి, తమ పేర్లూ తమవాళ్ల పేర్లూ ఆయన చేత ఇంగ్లీషు చెయించి పలికింపించి మురియడంతో ఆగేవారా, ప్రతీవస్తువుకీ ఇంగ్లీషేమిటో తేల్చేవరకూ ఆయన్ని జీడిలా పట్టుగునేవారు. ఆపళంగా ఆయన, తెలుగులో సార్థక పాల్లు లేకపోడం కనిపెట్టి గావును, తట్టకి ఇంగ్లీషు తట్, బుట్టకి బుట్, కష్టానికి కష్టం, గాలికి గాల్ అని అడిగిన తడువుగా బుకాయించి వాళ్లని వొదిలించుగునేవాడు. ఆయనకి భాగోతాలూ, తోలుబొమ్మలూ, పగటివేషాలూ, మేజువాణీలూ ఏమిష్టమో యిష్టం. అందులోనూ ముఖ్యంగా ఆయన లేందే భోగం మేళం ఏదీ జరిగేది కాదు. అభినయశాస్త్రంకూడా తనకి తెలుసునని ఆయన అనుకోడంవల్ల, ఎక్కడేనా మేళంలో, నాట్య స్త్రీ కాస్త శాస్త్రవిరుద్ధంగా హస్తం పడుతోందీ అని తను అనుకున్నప్పుడు, ఆయన చివాల్న లేచి అమాంతంగా అంత వేషంతోనూ, సిగ్గు అనేమాట లేకుండా, తెయ్యిమని తనూ భోగంఆట మొదలెట్టి, చూడొచ్చిన జనానికి పని కల్పించేవాడు. నాట్యం ఒకవేళ బాగుంటే, "ఎదేదీ! చంపకం! ఇందాకటి పదం మళ్లీ కానీ! ఇంకోమాటు పట్టు!" అని కోరుతూండేవాడు. లేకపోతే సూరన్న అన్నట్లు: "ఏది యేదీ, యిది చాలఁ గ్రొత్త, భళి! యింకొకమాఱిఁక నొక్కసారు" అని పట్టేట్టేవాడు. ఇంతకంటేనా అని ఆ స్త్రీ ఆయన ఆజ్ఞ అమలు జరిపేది. మరోమాట. ఆయనకి కొంచెం తిండిచపలత్వం కూడా ఉండేది. భోజనసమయంలో ఆయన సుబ్బరంగా మూగనోం అభ్యసించేవాడు. కాని, పదార్థాలు మారు కావలిసొచ్చినపుడు నోం భంగం అవుతూన్నందుకు బెంగ పెట్టుగోడం మానుకున్నాడు. ఎంచేతంటే, ఆయన అసలుకంటే కూరే ఎక్కువ వడ్డించుగునే వాడు. ఈ వ్యక్తి ఒకరాత్రి, "పాండవాజ్ఞాతవాసం" నాటకానికి వెళ్లాడు. అప్పటికింకా నాటకాలు కొత్త. తెర, దానంతటఅదే పైకివెళ్లడం ఏమిటో తెలియక, కొందరు సభ్యులకి మనస్సులో పక్కకూచున్నవాళ్లమీద తెగకోపంగా ఉండేది, గాని పైకి అనేవారుకారు. అవేళ భీముడు వేసిన ఆయన, ఒకరంగంలో, నాటకరంగంమీద ఉప్పట్లాడి, భూపాలరాగంలో ఉంటూ, గద విరక్కొట్టాడు. గానప్రియుడైన నవరసమూర్తిగారు, తన అలవాటును బట్టి, "ఏదీ! మళ్లీ కానీ!" అన్నాడు. సభవారిలో చాలా

మంది, పాపం, గదకేసి చూస్తున్నారుగావును; విరిగింది మళ్లీ ఎల్లా విరక్కొడతాడనుకున్నారో, లేక మూర్తి గారి గౌరవార్థం లోపలికెళ్లి మరోగద చెయించితెచ్చి ముక్కలుచేస్తాడనుకున్నారో, నవ్వారు. తను చేసింది నలుగురికీ నవ్వులాటలకింద ఉందిగావు ననుకుని, భీముడు నిజంగా కోపించి మళ్లీ పద్యం పాడడం మానేశాడు. మానేసేసరికి మూర్తిగారికి చాలాకోపం వచ్చింది – తన ఆత్మగౌరవం ఆరిపోతూన్నట్టు ఆయనికి అనిపించడం వల్ల. వెంటనే ఆయన లేచి నిలబడి మాట్లాడాడు. మామూలు ధోరణి మారి, వ్యాపారం ముదిరినప్పుడు, చాలా మంది తెలుగువాళ్లు లోగడ మాట్లాడుతూన్న తెలుగు మానేసి, ఎక్కువ గాంభీర్యంగా ఉండడానికి, యథాశక్తి ఇంగ్లీషులో కోపిస్తారు. ఓం ప్రథమం ఆయన "నాన్‌సెన్స్" అన్నాడు. ఆమాటతోటి ఆయన భీముణ్ణి బల్లీగ్గా తిట్టేస్తున్నాడని, జనం, తమకి ఇంగ్లీషు రాకపోపట్టి, భ్రమించారు. తరువాత, ఆయన భీముడికేసి సురసురాచూసి "వన్సుమోర్" అన్నాడు. ఈ యింగ్లీషు వెళ్లి భీముణ్ణి డీక్కొనే సరికి, అతనిశరీరం నఖశిఖ పర్యంతం కంపరంపుచ్చుకుంది. దాంతోటి అంత భీముడూ పద్యం మళ్లీ పాడడానికి ఉద్యుక్తుడయాడుగాని, అవడంలో కాస్త జాప్యం చేశాడు. నవరసమూర్తి, "ఐసే, వన్సుమోర్" అని కేకేసి, సభవారితో "చూస్తారేం?" అన్నాడు. ఆమట్టున, ఒక్కదెబ్బని, సభవారికి ఎక్కడ లేని ధైర్యంవచ్చి, ఆ మాట ఎవడు ఎల్లా పలకగలిగితే అల్లాగ, "వంశమోర్", "వంశమారి", "వనసమోరి" "హంసమార్", "హంసమార్క" ల్లాంటి ఉచ్చారణలతో గొల్లున గోలెత్తారు. భీముడు ఆ పద్యం మళ్లీపాడాడు. మొన్నాడు ఈసంగతి ఊళ్లో గుప్పుమంది. పదపడి దేశం అంతటా ఇది పాక్కి పనగలిసిపోయింది. "ఎందుకండీ, మీరు అల్లా నాటకంలో అన్నారు?" అని, తరవాత, నవరసమూర్తిగార్ని స్నేహితులు భోగట్టా చేశారు. భూపాలరాగం తనకి యిష్టం అని కొందరితోనూ, భీముడు అంత కోపంలో ఉన్నాగానీ సృతిలో రాగం తేల్చగలిగినందుకని కొందరితోనూ, భూపాలకీ కోపానికీ సంబంధం కనిపెట్టే ఉద్దేశంతోటని కొందరితోనూ, తన యిష్టం అనితక్కిన వాళ్లతోనూ ఆయన చెబుతూండేవాడు. ఏమయితేం, అప్పటితో సభవారికి నటుడుమీద ఒక హక్కు ఏర్పాటయింది.

కొత్తరికంలో ఈహక్కు, నవరసమూర్తిలాంటి పెద్దవాళ్లు, ఇంగ్లీషు నేర్చినవాళ్లు, అనగా నాటకపు గోతులోవారు, సాధింమగునేవారు. కొందరు, పద్యాభిప్రాయం తమరికి నచ్చి, ఆపద్యం మళ్లీ వింటే అక్కడికి మొహం మొత్తుతుందేమో చూద్దామనట. కొందరు పద్యరాగాభినయాల మేళవింపు బాగుండిట. చాలామంది రాగం బాగుండిట. కొందరు, నాటకరంగంమీద ఆతరుణంలో రసం చిప్పిల్లి పోతూంటేకూడా, తమరు గ్రహించలేకపోయారని ఎవరేనా అనిపోతారేమో, వెంటనే వన్సుమోర్ అంటే అత్యంతమరసజ్ఞతకి శాశ్వతపుపట్టామంజూరు అవుతుందనట. కొందరు, నాటకరసం మట అటుంచగా అంతమంది స్త్రీపురుషు లుండగా తమ ప్రత్యేక - ఆధిక్యతా, ఔన్నత్యం ఖాయపడడానికి మరో సమయం దొరకదేమో అనిట. అయితేం, పెద్దలలో కొంతమందికే నచ్చి, వారికోరికమీదే జరిగేది కడం పెద్దలకి నచ్చకపోడంవల్ల, వన్సుమోర్ జనానికి ప్రతిగా నోమోర్ జనం, వీరికి ఎదురుచుక్కగా ముయ్‌నోర్ జనం బయలుదేరారు. ఇల్లాంటి గలిభీ మొదట్లో గోతులోనే జరిగేది. ఒక పెద్దమనిషి ఒక నటుడు పాడిన పద్యంయొక్క అభిప్రాయం బాగుండిట వన్సుమోర్ అని అతడిచేత అది మళ్లీ పట్టింపించాడు. ఆ నటుడుగారి గానం చాలా బాగుండదు. అందుకని మరోపెద్దమనిషి (అనగా గోతులో కూర్చున్నాయన) ఆ నటుడు అప్పట్లో కనపరిచిన పనివాడితనం శూన్యం. అతడికి వన్సుమోర్ అనవసరం అని సూచించడానికి "క్రెడిట్ టు ది ఆథర్" అని ఇంగ్లీషులో అరిచాడు. ఏమయితేం? ఏదోవిధంగా ఎవరో కొందరు మెచ్చుకుంటూనే వన్సుమోర్ అంటూండడంవల్ల నటులు తమ ఇష్టం చొప్పునే పద్యం రెట్టించేవారు. ఇంతలో క్రమేపీ దేశం తెనుగుమీరింది. నాటకసభలో గోతులో కూర్చున్నా గట్టుమీద కూర్చున్నా హక్కు సమానమే అని తెలిసిపోయింది. ఆక్కణ్ణించి, బేడ టిక్కట్టువాడు కూడా, తన చుట్టుపక్కల

కూర్చున్న పది పదిహేనుగురుమంది తోటీ తను వన్స్ మోర్ అని కేకేసి నటుడిచేత పద్యం మళ్లీ పాడించి తీరుతానని ప్రగల్భాలుకొట్టి ఉండడంచేత, ప్రాణాలు ఉగ్గబెట్టి దిక్కుమాలిన సందర్భం ఏదో వెతికి,తనికి ఏవిధం చేతా అర్హత లేకపోయినా, గార్దభస్వరంతో "హంస మార్" అని చుట్టూ జనం అంతా తనయొక్క సాహస ధైర్యశౌర్యాలు మెచ్చుగోడానికి తనకేసి చూసేటట్టు కుయ్యడం, మామూలైంది. అలాంటప్పుడు గోతులో సభవారిలో కొందరికి కోపంవచ్చి, "నో నో" అని కూకలేస్తూంటారు. కాని గట్టుమీది సభవారు తమపాటి సభవాడియొక్క మాట పొల్లుపోతోందని విచారపడి, తమరు డబ్బు ఇచ్చేవాళ్లనిన్నీ, నటుడు డబ్బులాగే ఎదర పార్టీ అనిన్నీ, ఇచ్చేవాడిమాట పుచ్చుగునేవాడు పాటించి తీరాలనిన్నీ, పైగా నటుడికి ఏ ప్రత్యేకవిష యంలోనూ నా స్వంతం అని చెప్పుగోడానికి వీలైన బ్రహ్మాండప్రజ్ఞ లేదనిన్నీ, ఉన్న అల్పప్రజ్ఞకూడా మళ్లీకానీమంటూంటే నటుడు తెగనీలగ కూడదనిన్నీ ఆలోచించి, వన్స్ మోర్ అంటూ అంతా కలిసి గోలచేసే స్తారు. ఆ గోలకి ఆగలేక, అప్పుడు పద్యం పునహా చద వడంలో ఉండే సవ్యాపసవ్యాలు దూరంగాపెట్టి, నటుడు పద్యం మళ్లీ పాడతాడు. మెట్టుమాట, నటుడు ఎంత బిరుదు గలవాడైనాసరే, ఎన్ని వీసెల మెడల్సు ఉన్నవాడైనా సరే, ఎంత కొమ్ములు తిరిగినవాడైనా సరే మనమాట వింటాడా వినడా అనే సంగతి చూడడానికి వన్స్ మోర్ ప్రయోగించడం మొదలెట్టారు. ఇల్లాంటి పట్టింపుల్లో, పరిమితమైన నాటక సంఘంవాళ్లు గనుక ఆడేవాళ్లు ఓడిపోతారు. అపరిమితమైన సభవాళ్లు గనక చూసేవాళ్లు నెగ్గుతారు! మెజారటీ!

వన్స్ మోర్ అనడానికి అన్నీ సందర్భాలే. జంఝూటిగాని, పూరికల్యాణి గాని చాలా హెచ్చు స్రుతిలో పాడబోతుంటేచాలు, వనస్ మోర్! వాళ్ల అభిప్రాయం ఎంత హెచ్చుస్రుతిలో పాడితే అంత గానమని. అందుకనే వాళ్లు చప్పట్లూ, ఈలలూ అప్పుడు అంతగట్టిగా కొట్టి మెచ్చుతారు. అనగా వాళ్లు, ఈగానం మాగాడిదె అరిచినట్టుందే, అద్గది, మా గాడిదకి నేరుపోతున్నాడీయన, అచ్చంగా మా గాడిదే, అంటూ మెచ్చుగునేవాళ్లు. అట్లా పాడిన వాళ్లని గాని నటులు అని వాళ్లు అనరు. కథానాయకుడు నాయకురాల్ని సమీపించినా, ముద్దుపెట్టుగోన్నా వన్స్ మోర్! అందులో నాయకురాలు నిజంగా స్త్రీ అయితే, అడిగారూ మజా! రంగంమీద ఎవడేనా ఫలం తింటే వన్స్ మోర్! ఒకరాత్రి ఒక నాటకం ఆడే వాళ్లల్లో మొనగాడు పాటకుల్ని విడిచి, కడంవాళ్లు నోరెత్తి పద్యం ఈడ్చినప్పుడు ప్రతీసారీ వన్స్ మోర్! ఎవడేనా పాత్రధారి, అనేక కారణాలవల్ల, అనుకున్నట్లు రాలేకపోడంచేత వాడిస్థానే వాడికంటే రాగాధికుడు నిలబడకపోతే వన్స్ మోర్! రౌద్రపాత్రలు-భీముడు, విశ్వామిత్రుడు లాంటివి - సాధారణముగా పాటరానివాడికి పడతాయి. వచ్చినా, అప్పట్లో వాళ్ల కోపానికి ఆ రాగాలు కుడా హడిలి పారిపోతాయి. వాడికి పాట రానందుకు మామూలు హేళనకోసం వన్స్ మోర్ కొడతారు. వాడే ఒకవేళ కాస్తంత పాటగాడై మామూలు తప్పించి కాస్త చెవికి ఇంపుగా ఉంటే, ఎల్లాంటి అసాధ్యం సాధించావురా నాయనా అని వాణ్ణి మెచ్చుగోడానికి వన్స్ మోర్ అంటారు. ఒక నాటకంలో, మొదటి అంకంలో వచ్చేపాత్రలు ధరించినవాళ్ల గొంతికలు బొత్తిగా అపస్మారంగా ఉన్నాయి. రెండో అంకంలో కొంచెం సుళువుగా రాగం మెలితిప్పగలిగినవాడు వచ్చాడు. వాడిలో విశేషం, రామరామ, శూన్యం! కానైతేం, సభవారు వాడు రాగం తీసినప్పుడల్లా, "అమ్మయ్య. వన్స్ మోర్" అన్నారు. ఒకనాడు, ఒకసావిత్రి నాటకంలో సావిత్రిని సభవారు వన్స్ మోర్ తో ఏడిపించారు. కాని, యముడు రంగంమీది కొచ్చి పాట ప్రారంభించగానే,అతని పాట మరీ కాకి కూతలా ఉండడంచేత, సభవారు సావిత్రిని వొదిలి, యముణ్ణి మట్టుకు వన్స్ మోర్ తో అదరకాయిస్తోచ్చారు. చిల్లరి పాత్రలు ధరించేవాళ్లకి ఆట్టే 'పార్టు' ఉండదని (నాటకకారుడుమీది కోపం కొద్దిగావును కర్మం) వేళాకోళానికి కొందరు రసజ్ఞులు వన్స్ మోర్ కొడతారు. చిత్రనళీయంలో ఇంద్రాగ్నియమవరుణులు నలుగురూ నాలుగు

పాదాలూ పట్టుగుని ఒకపద్యాన్ని మెయ్యావలిసి వొచ్చినప్పుడల్లా వన్సుమోర్ అంటారు. ఒక సుదేవుకు "క్రమ్మరి పల్లటిల్లతిని" అనేపద్యం తారస్థాయిలో ఝుమాయించేసరికి, పచ్చిమంచినీళ్లు కూడా నోచుగోని వాడు అంత గాత్రసాధకం చూపెడుతూంటే, ఊరుకోడం న్యాయం కాదని సభవారు సోడా పుచ్చుగుని వన్సుమోర్ అన్నారు. ఒక సావిత్రిప్రదర్శనంలో, సత్యవంతుడు వేసిన రావు ఒక రమ్యమైన కీర్తన పాడి మూర్ఛిల్లాడు. జనం వన్సుమోర్ అని గోలెత్తారు. అనగా, చచ్చినవాడు మాబాగా చచ్చిపోయాడు, లేచి మళ్లీ చస్తేగాని మాకు తోచకుండా ఉంది, అని. తద్దినపుగార్లు తిన్నసాయిబు తద్దినానికి వన్సుమోర్ కొట్టినట్టు! సత్యవంతుడు లేవలేదు. సభవారు ఇంకా గట్టిగా కూశారు, బుసకొట్టారు, గర్జించారు, ఓండ్రపెట్టి దరువేశారు. అంటే, నాటకసభవారికుండే హక్కుల్లో కొన్నిమాత్రం ప్రకటించారు. అయినా సత్యవంతుడు లేవలేదు. మేనేజరు వచ్చి (అప్పుడింకా నాటకకంపెనీకి ఎవరో ఒక మేనేజరంటూ అఘోరించేవాడు) సత్యవంతుడు తీరా మూర్ఛిల్లిన సందర్భంలో లేచి మళ్లియిదవడం అసందర్భం అనిచెప్పాడు. "సత్యవంతుడేమిటయ్యా! ఆ రావు లేచి మళ్లీ పాడతాడా, ఏమన్నా కావాలా?" అని సభవారు మార్దవంగా అడిగారు. రావు లేచి మళ్లీపాడి, మళ్లీ మూర్ఛిల్లాడు ఖాయంగా. ఒక నటుడు రంగంమీంచి హుషారీగా నిష్క్రమించాట్ట. అతనికి వన్సుమోర్ కొట్టి వెనక్కివచ్చి మళ్లీ నిష్క్రమించమన్నారు, సభ్యులు. ఈమధ్య ఒక గొప్ప నటుడు, కవిరాసిన పుస్తకంలో లేని అక్షరాలు తగిలించి ఒకపద్యం చదవగా, అతడిచేత మళ్లీ ఆతప్పు అనిపించాలని వన్సుమోర్ అని జనం అంటే, ఆ వన్సుమోర్ తనని మెచ్చుగోడాని కనుకుని అతడు నవ్వుమొహంతో ఆ తప్పే పాడాడు. ఒక చోట విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడి కిరీటం తన్నుతూంటే తాపు దూసుకుపోయింది, ఆపళంగా జనం వన్సుమోర్ అన్నారు. దాంతోటి విశ్వామిత్రుడికి కోపం రెచ్చిపోయి సాగదీసి మళ్లీ తన్నడంలో అతనికాలి పాంకోడు హరిశ్చంద్రుడి కణతకి ఠకీమని కొట్టుగోడం, హరిశ్చంద్రుడు మూర్ఛిల్లడం, తెరవెయ్యడం, బోలెడు జరిగింది. మరీ ఇటీవల (అనగా, ఆంధ్రదేశంలో గ్రామఫోనుశకం పుట్టింతరవాత) నాటకరంగంమీంచి ఎవరేనా, తానుగాని మరి ఒకరుగాని లోగడ రికార్డులో ఇచ్చిన పద్యంగాని దరువుగాని పాడేసరికి ఉత్తపుణ్యానికి అది అప్పుడు బాగుండకపోయినా సరే వన్సుమోర్ కొడుతున్నారు. ఈ అలవాటు చొప్పునే, ఓ ఆసామీ మొన్న ఒక "టాకీ" ఫిల్ము జరుగుతూంటే, ఒక పాటవిని వన్సుమోర్ అన్నాడు. కొత్తగనక నలుగురూ నవ్వి ఊరుకున్నారు. టాకీ సభవారంతో ఏకగ్రీవంగా వన్సుమోర్ అంటూ రొదచేస్తే ఉండే ఫలితం చూడాలి. ఒకసారి కరటకశాస్త్రి పాత్రధారి నత్తడం మొదలెట్టాడు—కవి రచించినదానికి మెరుగుపెట్టాలనే ఉద్దేశంతో. సభవారు వన్సుమోర్ అన్నారు. అని అతణ్ణి కొత్తమాటకి వెళ్లనియ్యక, నత్తినత్తి చచ్చిచెడి పూర్తిచేసిన వెనకటి పదమే అతనిచేత మళ్లీమళ్లీ నత్తబెట్టించారు. వాక్యానికి ఓపుష్కరం చొప్పున పట్టేటట్టు కనిపించింది. ఆ అబ్బాయికి కొంతసేపయేసరికి నత్తడంలో ఉండే సరదా తీరిపోయిందిగావును, అందరికిమల్లేనే సంసారిపక్షంగా మాట్లాడ్డం మొదలెట్టాడు. అంతత్వరలో అతనికి నత్తినయం అయినందుకు అంతా ఆనందించారు. కాని, కొన్నికొన్ని నాటకాల్లో కథపట్టులో ఉండే సారస్యంవల్లో, కవిత్వంలో ఉండే హృద్యతవల్లో, కొన్ని పద్యాలకి, ఏచవట-నటుడు ఆపాత్రధరించి అవి పాడినాసరే, జనం వన్సుమోర్ అనితీరేవి బయలుదేరాయి. వాట్లని నటులు వన్సుమోర్ పద్యాలు అంటారు. వాటిలో కొన్ని: "నిటలాక్షుండిపు డెత్తివచ్చినను రానీ," బహులోద్యత్ప్రళయానిలక్షుభిత," "అల్లుడా(య్) రమ్మని," "అతివా(య్) దా(య్) పగనేల," "కొండయండ నుద్దండుడై" "జెండాపై కపిరాజు," "గగనేందిరారామ"— (దీనికి పాఠాంతరం : 'గగనేద్దిరారాబ' అంటారు కొందరు) లాంటివి.

అయితే, ఈ వన్సుమోర్‌లో ఉండే ప్రధాన విశేషం ఏమిటంటే, నటుడు గానయుతంగా అభినయించినప్పుడు తప్ప ఇది పుట్టనేపుట్టదు. వచనం చెబుతూ

అసాధారణంగా అభినయించే నటుడికైనా సరే, వన్సుమోర్ లభించదు. బాహుక పాత్రధారి ఎంత అఖండుడైనా సరే, ఉత్తరం చదవడందగ్గిర వన్సుమోర్ పొంది ఉండడు—అది వచనంలో ఉండిపోయింది గనక. కాని, గానం లేని సందర్భాల్లో అభినయంవగైరాలు మిక్కిలి హృద్యంగా ఉంటే, చప్పట్లుకొట్టి మెప్పు కనపరుస్తారే గాని, వన్సుమోర్ అనరు. అందుకని, వేళాకోళాలమాట అటుంచి, త్రికరణశుద్ధిగా వన్సుమోర్ అనేవాళ్లు ఆగానం కోసమే. పాటకచేరీలో మళ్లీ సర్వం శాస్త్రోక్తమాయిష్టం అవడంచేతగావున ఆగానంకోసం వన్సుమోర్లు ఉండవు. కాబట్టి సంగీతం బాగా తియ్యగలిగిన నటులు (ఆసంగీతం నాటకానికి పెద్దా, పాటకచేరీకి చిన్నా అవుగాక) వన్సుమోర్ కోరుతారు. ఎవరిమెప్పు ఎవరు వొదులుకుంటారు! కొందరు నటులు తమరికి వన్సుమోర్ కొట్టడానికి జనాన్ని నియమించి సభలో కూచోపెడతారు. కొందరు, వన్సుమోర్ అని సభవారు అనేవరకూ కీర్తన ఈడుస్తూనే ఉంటారు. కొందరు, సభవారు వన్సుమోర్ అనకం తడువుగా మళ్లీ పాడేస్తారు. కన్యాశుల్కం మరతులేని సంబంధంవస్తే లుబ్ధావధాన్లు వదులుకుంటాడా చూసి చూసి! అతనికి మళ్లీ సంబంధం రాకపోతే! కొందరు, సభవారు వన్సుమోర్ అంటే ఎల్లానూ పాడాలిగదా, అనకుండానే పాడేస్తే తీరిపోతుందని పద్యాన్ని ఈచివరనించి ఆచివరకి దూడపింజెలాగ ఏకేసి చెడుగుడి ఆడించి, కుస్తీపట్టించి, బాదిబాది ముప్పతిప్పలా పెడతారు. ఇల్లా చేసేది ఎవరూ అంటే, రాగపుకర్రల బోట్లు పెట్టుగోకపోతే రంగంమీద నిలబడలేని వాళ్లు. మరోరకం ఎవరంటే తుణ్ణంగా ముక్కలువచ్చి ఉచ్చారణ బాగుండి, సార్థకంగా అభినయించినా గొంతుక సాఫులేనివాళ్లు. వీళ్లకు వన్సుమోర్ తగిలిందంటే వీళ్లని ఏడిపించడానికే. కాని వీళ్లల్లో ఒకొక్కడు, తనపాట నచ్చక వేళాకోళానికి సభవారిలో కొందరు వన్సుమోర్ అన్నారని తెలిసీకూడా వారికంటే తనే మొండి ఘటాన్నని ఋజువు ఇవ్వడానికి, ఆపద్యం మళ్లీ అడిగినవాళ్లు జన్మమధ్యంలో అడక్కుండానూ అడగనివాళ్లుకూడా అనుభవించ గలందులకున్నూ, యావన్మందికీ ఆ పద్యం పామి, పట్టించి, ఫులిమి, రుద్ది, తలంటేస్తాడు.

ఇందులో ధర్మసందేహమేమంటే, అపరిమిత జనం ఉన్నప్పుడు, ఒకళ్లకో పదిమందికో తనివితీరక పోడంవల్ల మళ్లీ జరుగుతూండే సంగతి, కడంవాళ్లందరూ భరించవలసిందేనా? అని. అప్పట్లో రంగం అల్లా ఆపుచేసి వోట్లు తీసుగోడం ప్రారంభిస్తే, తెములుతుందా? అట్లాంటిది వీలుండదుగదా అనే ధైర్యంకొద్దీ గావును, ఆ పది ఇరవై మందీ లక్ష గోల చేస్తారు. గోల చేసేవాళ్లు గొప్పవాళ్లు. మనం ఎన్నికల్లో చూస్తున్నాంగా! ఇదంతా తన ప్రతిష్ఠకోసమే అనుకునే నటుడు, వెంటనే మెత్తపడి మళ్లీకానిస్తాడు—స్వలాభం సంగతి మనస్సులో పెట్టుగుని. కాని, సార్థక నటుడు యొక్క అభిప్రాయం వెరికా, ఇప్పుడూకూడా ఇందుకు భిన్నమే. ఒకగొప్ప నటుడు ఒకసీసపద్యం లాంటిది, అభినయించి, సభవారు ఈసడించుగోకుండా, ఆంజనేయులు తోకలాగ రాగం పెంచుతూపాడి పనిచూపాడు అనుకోండి. అతడు ఆటైములోనే పైనచెప్పినట్లు చెయ్యడమేకాకుండ, వృత్తాంతం తెలిసేటట్టు ముక్కలుపలికిఉండి, కొన్నికొన్ని చేష్టలుచేసి, రక్తి తెచ్చి, మనమనస్సులకెక్కి అప్పుడు అన్యాడై గోచరిస్తే, అప్పుడు అతడు పనివాడు; "అమ్మయ్య! ఈపద్యం అయిందిరా బాబూ, మనం కాస్త ఊపిరి పీల్చుగోవచ్చును అని వాడు అనుకొనే క్షణంలోనే జనం వన్సుమోర్ అంటారా, వాడికి విసుగొచ్చి, విరక్తిపుట్టి, తను మొదటిసారి ప్రాణంధారపోసి త్రికరణ శుద్ధిగా చూపెట్టినపని యావత్తుగీ ఇన్నినీళ్లు వొదులుకొని, నిర్బంధితుడవడం వల్ల, తద్దినంపెట్టినట్టు ఏదోతగలేసి మొక్కచెల్లించుగుంటాడు. గొప్పనటులంతా ఈఅనుభవం పొంది ఉంటారు. పాదుకలో ఒక దశరథుడు అల్లా చేశాడు. పైగా మొదటిసారి ఇటూ అటూ తిరుగుతూ అభినయంలో పద్యం పాడిన వాడు, రెండోసారి ప్రాణంచాలొచ్చి, సోఫామీద కూచుని పాడాడు. "కూచుంటావేం? నుంచోవేం?" అని వన్సుమోర్ జనాభా కేకవేశారు, నటుడు అనామకుడు కాకపోడంచేత. ఆకేక

లు మరికొందరు ఆర్పేశారు. ఇల్లా వన్సుమోర్ కొట్టే జనమే చివరికి ఏమంటారో విన్నారా! మొదటి అభినయంలో ఉండే పస, పసందు, హుషారీ, మజా, ఇవన్నీ రెండోసారి లేవుట. అందువల్ల అతడు గొప్ప యాక్టరు కాడుట. అనగా, తమరు ఎన్నిసార్లు గోలచేస్తే అన్నిసార్లు, ఏక రీతిగా, ఒకేపద్యం పాడగలిగినవాడు వాళ్ల దృష్టికి పనివాడు. అంటే నటుడు ఒక యంత్రం అవాలని వాళ్ల ఆదర్శం.

మారు కోరేవాడు నవరసంగారే కాడు. చిరితిండైతే సరేసరి, అసలు తిండైనా కుడా పిల్లలు "నాకింకా కావాలి" అని పట్టు పడతారు. పట్టుబట్టి చివరకి అంతా పారేస్తారు, లేకపోతే రోగాలు తెస్తారు. పెరుగు యొక్క వాలకం చూసి కొందరు అన్నం ఎక్కువ పెట్టించుగుంటారు. 'ఇంకా కొంచెం' అనేది దురలవాట్లలోనే కనిపిస్తుంది. "ఇంకా కొంచెం" చొప్పున ద్రావకం పుచ్చుగోడంనించే చాలా మందికి స్థల భాండవిసర్జన. టికట్టులేని సంతర్పణలో ఎవడికేనా ఒక వంటకం బాగుంది అని తోచినప్పుడు వాడు మారు వడ్డించుగోవచ్చు, కడం వాళ్లకి బాధలేదు. పోనీ, కాఫీహోటల్లోకి వెళ్లి, కాఫీ చాలా బాగుంటే, "వన్సుమోర్" అనికేకెయ్యొచ్చు–హోటలాయన "ఎగస్ట్రా" అని కేకస్తాడు! మళ్లీ ఇస్తాడు! ఇచ్చేవాడికి నష్టంలేదు, లాభంఉంది, తక్కిన వాళ్లకి కష్టంలేదు గనక. నాటకసభలో వన్సుమోర్ అన్నప్పుడు అదనపు ఖర్చులేకపోబట్టి ఇల్లా ఉన్నట్టు కనిపిస్తుంది.

పోనీ వన్సుమోర్ అందరికీ ఒప్పుదలే అనుకుందాం. రెండవ అభినయం సహజంగా పేలవం అని గ్రహించవచ్చు. ఒకడు పెరుగూ అన్నం ఒక వాయి భుజించాడు అనుకోండి. అది వాడికి చాలా రంజుగా ఉంది. ఆ పళాన్ని వాడు మళ్లీ అన్నం పెట్టించుగుని, పెరుగు పోయించుగుని, మొదటి మోస్తరుగా ఉంటుందనుకోడం అజ్ఞానం. తినేసిన పెరుగూ అన్నం మళ్లీ ఎల్లా వస్తుందీ? పోనీ ఆ అన్నం ఆ రాశిలోదే, ఆపెరుగు ఆ కుండలోదే గదా అంటే, కాలం మారలేదూ? తినేవాడు వాడేగదా అంటే వాడిలోమాత్రం మార్పులేదూ? మొదటివాయి తిన్నప్పుడు అతనికి పెరుగూ అన్నం సరికొత్త. దాని రుచి ఒకటి. రెండోవాయి తినకమున్నుందే అతడు మొదటిరకం తిని ఉన్నాడు. అందుకని ససంబంధంగా చూస్తే, రెండోతిండి వాడికి పేలవంగా ఉండితీరుతుంది. దానిరుచి మరొకలా కనిపిస్తుంది. అందుకనే పెద్దమనుష్యులు ఫలారం చేసేటప్పుడు (అనగా ఫలాహారంలో ఫలాలు ఉండవు) తీపి తినడం తోటే, ఎంతపంచదార గుప్పినా కాఫీలో తీపి అందుకోక, పీల్చలేక, ఓ పకోడీయో గట్రో నాలిక్కు అడ్డేసి మరీ కాఫీగిన్ని ఎత్తుతారు. ఇది సభ్యుల చిక్కు. ఇకనటుల్ని గురించి చూస్తే! నటులు మనుష్యులు. ఒక క్షణంలో ఒక సార్థక నటుడు కనపరచింది మరొక క్షణంలో కనపరచలేడు. కనపరచగలిగాడా అతణ్ణి మంచియంత్రం అనచ్చు, అతడి అభినయాన్ని మంచి కసరత్తు అనచ్చుగాని, కళ అనకూడదు. ఈ మాట ప్రతి కళకీ చెందుతుంది. అంతదాకా యెందుకు? ఒకడు "క" అనే అక్షరం పెద్దదిగా కాగితంమీద రాసి, తుళ్లీ వాడే, ఉత్తరక్షణమే, మొదటి "క" పక్కనే ఇంకో "క" రాస్తే ఎక్కడో ఏదోతేడా ఉండకమానదు. "వన్సుమోర్" "వన్సుమోర్" అని ఒక మనిషి రెండు కేకలువేస్తే రెండింటికీ తేడా ఉంటుంది. కాని, యంత్రం కొట్టే అచ్చు "క"లు అన్నీ అచ్చంగా ఒకలాగే ఉంటాయి, గ్రామఫోను పలికే పలుకులు మళ్లీ అచ్చంగా అల్లానే ఉంటాయి. "ఒకచెట్టుమీద అనేకవేల పత్రాలు ఉండచ్చు. కాని ఏ రెండిటికీ సకలవిధ సామ్యం ఉండదు. ప్రకృతే అట్లా ఉన్నప్పుడు ఇక, మానవుడు రెండు వేర్వేరు క్షణాలలో చూపినపనులు అచ్చంగా ఒకలా గుండటం అసాధ్యం,ఒకలాగే ఉన్నాయా, ఏదో ఒకటి దగా, సాధారణంగా రెండు కూడా దగా అన్నమాట" అని ఒక మహాజ్ఞాని అన్నాడు.

తెలుగు సంగీతనాటక ప్రదర్శనాలలో ఉండే వన్సుమోర్ అనేటటువంటి సాంప్రదాయంలో:–సభలో ఉండే అనేకుల ఇష్టాయిష్టాలు చూడకపోడంవల్ల, న్యాయంలేదు; అనుభవించేసింది మళ్లీ అనుభవిస్తాం, కాలాన్ని వెనక్కితోడు, అసాధ్యాన్ని సాధించు అని

నటుణ్ణి సభవారు అడిగి, అతడు ఓడిపోయాడని అతణ్ణి సాధించడంలో ధర్మం లేదు; నటుడు ఈ అసాధ్యాన్ని సాధిస్తానని ఒప్పుగోడంలో జ్ఞానం లేదు; ఒకే కాలమందు రంగంమీద ఉండే అయిదారుగురిలోనూ, శీక మంచిది గల ఒకరికి, కడంవాళ్ల కళ్ల ఎదట, సభవారు "వన్సుమోర్" కట్టబెట్టి మెచ్చుగుంటే, కడంవాళ్లని తిట్టకపోయినా వాళ్లు నిరుత్సాహపడడంచేత నాటకం ఎంత పాడవుతుందో సభవారు గ్రహించకపోడంవల్ల, దూరదృష్టి లేదు; సభవారు ఆ మాట ప్రతీ సందర్భంలోనూ వాడడంవల్ల మెప్పులేదు; సభవారికి పెట్టుబడి ఖర్చులేని వ్యాపారం అవడంవల్ల, విలవ లేదు. అందులో తన కళ్లకి కట్టిన ఖరీదు ప్రతిఫలిస్తోంది అని నటుడు అనుకోడంలో విచక్షణ లేదు — ఎంచేతంటే, పద్యానికి అర్థం తెలియనివాడు కూడా వన్సుమోర్ అనడానికి వీలుంది కనక! స్మారకంలేనివాళ్లు కూడా అనొచ్చుగనక. వెయ్యిమంది స్మారకరహితులు మెచ్చుగునేకంటే ఒక్కడు స్పృహలో ఉండి మెచ్చుగుంటే చాలు. వెయ్యిమంది సామాన్యుల మెప్పుకంటే ఒక్క జ్ఞాని మెప్పు గొప్ప. "చంపకం! ఏదీ! మళ్లీ గజ్జికట్టు నువ్వు!" అని నవరసమూర్తి అడిగినట్టు ఎవరైనా సరే సభలోంచి ఏ సందర్భంలోనైనా సరే నటుణ్ణి మళ్లీ కానిమ్మని అడగడంలో తెలుగు సంగీత నాటకరంగంయొక్క ఔన్నత్యం కనపడదు. నటుడి కళ చాలా అల్పకళ అని జనాభిప్రాయమా అనే మాటకి వన్సుమోర్ ఒక ఉదాహరణ. ఏ సందర్భం అయినాసరే సభవారిచేత వన్సుమోర్ పొందగలిగినవాడు తనుతనే అని వారిచేత అనిపించుగుంటున్నాడు అన్నమాట. తను అన్యుడు కాలేక పోయాడన్నమాట. అప్పట్లో అతనిని "నటుడు" అనడంకంటె మరేమన్నా అనడం సమంజసం అన్నమాట.

## ఈశ్వర స్తవము

కీ. శే. శ్రీమన్మహోపాధ్యాయ కల్లూరి వేంకటరామశాస్త్రి గారు

దీప్తదివాకరేందులను దివ్వెల వెల్గెడు చక్రవాళప
ర్యాప్తవసుంధరావలయరంగముపై బహుతారమౌక్తిక
వ్యాప్తనభోవితానమును వాసిగఁ గూర్చి సమస్తభూతపా
త్రాప్తిని సూత్రధారుఁ డెతఁ డందు ముదం బతఁ డిచ్చు భద్రముల్.

తాత హుళిక్కి, మాతయును దబ్బఱ, యూరికిఁ బేరు లేదు, నీ
భూతియు సర్వమంగళము, పుట్టము లెన్న దిగంబరుండ వి
ట్లీతలఁ జూడ బట్టబయ లే నిఁక వర్ణన నేమొనర్తు న
ద్వైతవిభూ! చమత్కృతిగదా మనకే తగు నందుకో కృతిన్.